భయం భయం.. హైవే ప్రయాణం


గంగవరం జాతీయ రహదారి

- ప్రాణాలు మింగేస్తున్న జాతీయ రహదారి
- శరవేగంగా వాహనాలు
- పశువుల సంచారంతో ప్రమాదాలు
- ఆందోళనలో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు


హైవేపై ప్రమాద దృశ్యం (ఫైల్)


రహదారిపై సంచరిస్తున్న పశువులు

గంగవరం: మండల పరిధిలో ఉన్న 516ఈ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఆరు నెలల కాలంలో గంగవరం- అడ్డతీగల, గంగవరం- రంపచోడవరం రహదారిలో సుమారుగా 16 రోడ్డు ప్రమాదాలు జరిగి సుమారు పది మంది వరకు మృత్యువాత పడినట్టు లెక్కలు చెబుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంతో విస్తరణ బాగా పెరిగింది. దీంతో ఈ దారిలో పెద్దపెద్ద వాహనాల రాకపోకలు కూడా పెరిగాయి. విశాలమైన దారి కావడంతో వాహనాల వేగంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పలువురు చెబుతున్నారు. దీంతోపాటు జాతీయ రహదారిపై పశువుల సంచారం ప్రమాదాలకు ఓ కారణమని చెబుతున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాల్లో జరుగుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు తగిన నిబంధనలను పాటించకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నట్టు పలువురు చెబుతున్నారు. నిత్యం గంగవరం నుంచి అడ్డతీగల వైపు, గంగవరం నుంచి రంపచోడవరం వైపు, గోకవరం వైపు వందలాది మంది ప్రయాణిస్తూ ఉంటారు.

జాతీయ రహదారి వెడల్పుగా నిర్మించడంతో కొంత మంది వాహనచోదకులు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతున్నారు. దీంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. రైతులు వారి పశువులను వదిలేయడంతో అవి జాతీయ రహదారిపై తిష్టవేసి ఉంటున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపై తిష్టవేసిన పశువులను గుర్తించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడి మృత్యువాతకు గురవడమో లేక తీవ్ర గాయాల బారిపడడమో జరుగుతున్నట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో అక్కడక్కడ బ్రిడ్జిలు వద్ద కూడా సరైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వంతెనల వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెబుతున్నారు. గంగవరం- రంపచోడవరం రూట్‌లో కుసుమరాయి వంతెనకు సమీపంలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో గంగవరానికి చెందిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి బాపన్నదొర మృతి చెందగా, మరసటిరోజు పశువులు అడ్డంగా రావడంతో పీఆర్ జేఈ అబ్బాయిదొర బైక్ ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే గంగవరం - అడ్డతీగల రూట్‌లో గత జరిగిన వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. అడ్డతీగల నుంచి రంపచోడవరం మండలం వరకు జాతీయ రహదారి దాదాపు పూర్తి కావడంతో గ్రామాల సమీపంలో వాహనాలు కూడా చాలా వేగంగా నడుపుతున్నారు. వీటిని అడ్డుకట్ట వేయడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామాల ప్రవేశాల వద్ద, వంతెనలు, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది

తరచూ వాహనాల తనిఖీలు

జాతీయ రహదారిపై తరచూ వాహనాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. వాహన పత్రాలు సరిగ్గా లేని వారికి జరిమానాలు విధిస్తున్నాం. అలాగే ట్రాఫిక్ రూల్స్‌పై యువతకు అవగాహన కల్పిస్తున్నాం. రోడ్లపై పశువులు సంచరించడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు చర్యలు తీసుకున్నాం. రోడ్డలపై పశువులను వదిలేస్తే వాటిని గోశాలలకు తరలిస్తాం.
– బి.వెంకటేష్, ఎస్‌ఐ, గంగవరం

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ప్రధాన రహదారులకు సమీపంలో ఉన్న పాఠశాలల వద్ద రహదారులపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. పిల్లలు పాఠశాలకు వచ్చే సమయంలో వెళ్లే సమయంలో వాహనాలు వేగంగా వెళ్తుంటే భయమేస్తుంది.
– కె.కృష్ణ – టీచర్, పిడతమామిడి

రోడ్లపై పశువుల సంచారం అరికట్టాలి



రోడ్లపై పశువులు రాకుండా సంబంధిత రైతులు శ్రద్ధ తీసుకోవాలి. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి. రహదారులపై పశువులు సంచరించకుండా అరికడితే ప్రమాదాలు కొంతమేరకు తగ్గుతాయి.
– మడకం వెంకటరమణ, గంగవరం

వీధిలైట్లు, సీసీ కెమెరాలు తప్పనిసరి



ప్రధాన రహదారుల్లో, గ్రామాల్లో ఖచ్చితంగా వీధిలైట్లు ఏర్పాటు చేయాలి. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి. వీధి దీపాలు లేని కారణంగా చాలా చోట్ల పాదచారులు కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి.
– సీదరి పాపారావు దొర, గంగవరం

క్లుప్తంగా

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆదివాసీ యువత

ఎటపాక: ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గొమ్ముకొత్తగూడెంలో ఆదివాసీ చట్టాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరిషత్ మండల నాయకులు రాంబాబు మాట్లాడుతూ ఆదివాసీలకు ఉద్యోగ భద్రత, 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఖాళీ ఉద్యోగ పోస్టులను ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలన్నారు. చింతూరులో జరగున్న ఆదివాసీ హక్కుల గర్జన సభను విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించి పిలుపునిచ్చారు. శివాజీ, కుమారి, రాందాస్, రాము, ఖాసీం, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నృత్య పోటీలు


చిన్నారుల నృత్యాలు

డుంబ్రిగుడ: మండలంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నృత్య పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శెట్టి సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా ముందంజ ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటపాటల్లో ప్రోత్సహించాలని ఆమె కోరారు. గురువారం నిర్వహించిన నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను త్వరలో అందజేస్తామన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

పాడేరు రూరల్: అరకులోయ గురుకులం రెసిడెన్షియల్ (పివిటిజి) బాలుర పాఠశాలలో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్, కన్వీనర్, పి.ఎస్.ఎన్.మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలోని 3వ తరగతిలో ఖాళీ ఉన్న సీట్లను లాటరీ ద్వారా భర్తీ చేస్తున్నట్టు తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లకు ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94937 58072, 94909 57219 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


తీవ్ర గాయాలైన హరికృష్ణారెడ్డి

వి.ఆర్.పురం: మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కొండ రెడ్డి గిరిజనులకు గాయాలైన సంఘటన చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మిలేరు పంచాయతీ పరిధిలోని గొందూరు గ్రామానికి చెందిన పాగల హరికృష్ణ రెడ్డి, కెచ్చల కిరణ్ మండల కేంద్రం నుంచి గొందూరుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిలో హరికృష్ణారెడ్డికి తల, ముక్కుకు తీవ్ర గాయాలు కాగా, కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన వీరిని రేఖపల్లి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని కూనవరం మండలం కోతులగుట్ట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక వేల్పుల వీధి రజకుల కాలనీలో కనకదుర్గ ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. జానకీరామరాజు, రమేష్, రాఘవ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సలీం మృతి పార్టీకి తీరని లోటు


సలీం పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తదితరులు


సలీం అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సలీం అలియాస్ చెల్లయ్య (68) మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ తీవ్ర నష్టమని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. సలీం మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వారు వేర్వేరుగా వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, నాయకులు సలీం పార్థీవదేహానికి నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సలీం అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొని సలీం శవపేటికను శ్మశానవాటిక వరకు మోశారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సలీం మృతికి సంతాపం తెలిపిన వారిలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్, ముస్లిం మతపెద్దలు హైదర్ ఆలీ, మహమ్మద్, సర్కాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వర్తక సంఘం పెద్దలున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


గొడ్డుబూసులులో పూజలు చేస్తున్న భక్తులు

జి.మాడుగుల: మండలంలో సింగర్భ పంచాయతీ గొడ్డుబూసులు గ్రామంలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో గురువారం జరిగింది. ఆలయ ధర్మకర్త ఐసరంగి రామకృష్ణ, నాగమణి దంపతులు, స్థలదాత, గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు ఆలయ ఆవరణలో విశ్వశాంతి హోమం జరిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా భక్తులు చేపట్టారు. ఆలయంలో గణపతి పూజ, పంచపాలకుల పూజ, అష్టదిక్పాకుల పూజ, నవగ్రహ పూజ, దాన్యాధివాసం, పుష్పాధివాసం, వేంకటేశ్వర స్వామి సేవ కార్యక్రమాలు వైభవంగా జరిపారు. ఎండోమెంట్ ఏఈ అప్పారావు, సిబ్బందికి నవీన్, సతీష్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నసమాధాన కార్యక్రమం నిర్వహించారు. థింసా నృత్యాలు, హరిభజన కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ధర్మ ప్రసారప్రముఖ్ రీమెలి అప్పలరాజు, భజరంగదల్ ప్రముఖ్ మత్స్యరాజు, అర్చకుడు పొట్టిబాబు, గ్రామపెద్ద దేముళ్లనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన


గుత్తులపుట్టు వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పాడేరు రూరల్: మండలంలో గుత్తులపుట్టు (సంతబయలు)వారపు సంతలో గురువారం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు నాగసాయి కళాజాత బృందం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. నాటకం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. అనంతరం కళాజాత బృంద సభ్యుడు శ్రీను మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలనకు అందరూ చైతన్యవంతులు కావాలన్నారు. వ్యాధిగ్రస్తులు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో ఏఆర్‌టీ మందులు పొందాలన్నారు. ప్రజలకు మరింత ఉపయోగ పడే విధంగా ప్రతి వారపు సంతలో ఈ కళ జాతర బృందం ఆటపాటలతో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కళాజాతర బృందం, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి కల్యాణోత్సవం


వేడుకలో పాల్గొన్న భక్తులు

కోటకోట: మండలంలోని బంగారయ్యపేటలో చౌడేశ్వరి సమేత సాంబమూర్తి ఆలయంలో అమ్మవారు కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల్లో చేరనున్న 581 మంది చిన్నారులు

కొయ్యూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల నుంచి 581 మంది పిల్లలు ప్రాథమిక పాఠశాలల్లో చేరనున్నట్టు సీడీపీవో విజయకుమారి గురువారం తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఏప్రిల్ లోనే సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశామన్నారు. ఇందులో భాగంగా 300 మంది బాలికలు, 281 మంది బాలురు ఒకటో తరగతిలో చేరుతున్నట్టు పేర్కొన్నారు. పూర్వప్రాథమిక విద్యలో భాగంగా వారికి ప్రాథమిక విషయాలను బోధించినట్టు తెలిపారు.

నేడు మండల సమావేశం

అడ్డతీగల: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. ఎంపీపీ బోడ్డపాటి రాఘవ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పై శాఖాపరమైన అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదిస్తామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పనుల ప్రతిపాదన ఉంటుందన్నారు. అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలపై చర్చ జరుపుతామన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట

గంగవరం: మండల కేంద్రంలోని గడి పోతురాజు బాబు స్వామి ఆలయ పునఃప్రారంభంలో భాగంగా స్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమం, హోమం, 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం జాతర మహోత్సవాలు ప్రారంభమవుతాయని, ఈనెల 13వ తేదీ వరకు జరుగుతాయని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని కోరారు.

యూకలిప్టస్ పెంపకంతో అధిక దిగుబడులు


శివరాంపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: యూకలిప్టస్ తోటలు పెంపకం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని శాస్త్రవేత్తలు శైలజా కుర్రా, వి.ప్రసాదరావు తెలిపారు. జాతీయ అగ్రో ఫారెస్ట్రీ దినోత్సవం సందర్భంగా రుషిల్ డెకోర్ లిమిటెడ్ సంస్థ ఆర్.శివరాంపురంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూకలిప్టస్ మొక్కలు నాణ్యతతో కూడి మూడు నుంచి ఐదు సంవత్సరాల్లోనే రైతులకు ఆదాయం తెచ్చిపెడతాయన్నారు. అత్యధిక దిగుబడి సాధించిన రైతులు గొలగాని శ్రీను, జి.మోదయ్య, సిహెచ్.రాజారావు, ఎం.రమణబాబు, సిహెచ్.హంసరాజు, కె.సత్యనారాయణ, వై.గణేష్ తదితరులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందించి సత్కరించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి


సూచనలిస్తున్న అధికారులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వెలుగు వీవోఏలతో గురువారం వెలుగు ఏపీడీ డేగలయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. డ్వాకా సంఘ మహిళలకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించాలన్నారు. వీఓఏలకు (బుక్ కీపర్లకు) లోకోస్ యాప్‌పై మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. లోకోస్ యాప్‌లో ప్రతి సంఘ సభ్యుల వివరాలు, పొదుపు, రుణాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వెలుగు ఏపీఎం రామాంజనేయులు, స్థానిక యూనియన్ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సామ్రాట్ మాట్లాడుతు బ్యాంకు లింకేజీ రుణాలు ఎవరికి మంజూరు చేయాలో ముందుగానే నిర్ధారించుకొని, సంఘంలో తీర్మానాలు చేయాలని కోరారు. మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు బాలమ్మ, సీసీలు సుధాకర్, లక్ష్మీనారాయణ, సత్యన్నారాయణ, చిలకమ్మ, లింగమ్మ, రామకృష్ణ, వీఓఏలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు


అధికారుల తీరుపై నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

హుకుంపేట: విద్య, వైద్య ఆరోగ్యం పట్ల అధికారులు జాగ్రత్తలు వహించాలని ఎంపీపీ కూడా రాజుబాబు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ సమావేశంలో ఆయన అన్ని శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో అధికారులు నాయకులతో సమష్టిగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో విద్య రంగంలో విద్యార్థులు వెనకబడి ఉన్నారని, విద్యా రంగంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు విత్తనాలు అందించాలని వ్యవసాయ అధికారులను కోరారు. ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో చెల్లయ, ఏవో సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు కొండలరావు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులు

కోటకోట: నూతన బియ్యం కార్డు పొందడం, దానిలో మార్పులు, చేర్పుల కోసం సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ గురువారం తెలిపారు. బియ్యం కార్డు పొందే వ్యక్తి తప్పనిసరిగా రాష్ట్రానికి చెంది స్థానికుడై ఉండాలన్నారు. ప్రజా సాధికార సర్వేలో తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. ఏ సచివాలయ పరిధిలో వారు అక్కడ నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆధార్ వివరాలు కూడా సంబంధిత గ్రామానికి చెందినవై ఉండాలన్నారు. ఇప్పటి వరకు బియ్యం కార్డు లేని వ్యక్తి తమ తల్లిగాని, అత్త కార్డులో గాని లేని వారికి మాత్రమే కొత్త బియ్యం కార్డు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. పిల్లలను బియ్యం కార్డులో చేర్పించడానికి వారి జనన ధ్రువీకరణ పత్రం, పెళ్లి అయిన వధువును చేర్చడానికి వారి వివాహ ధ్రువపత్రంగాని, ఆధార్ కార్డులో ఆమె భర్త పేరు ఉన్నచో దాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్నారు. బియ్యం కార్డును విభజించడానికి ప్రజా సాధికార సర్వేలో వేరుగా ఉండాల్సి ఉంటుందన్నారు. లేనిచో విభజన సాధ్యం కాదన్నారు. బియ్యం కార్డులో మృతి చెందిన వ్యక్తిని మాత్రమే తొలగిస్తారన్నారు. తప్పుగా ఉన్న ఆధార్ కార్డును వదిలేసి కొత్త ఆధార్‌తో ముందుగా ప్రజా సాధికార సర్వేలో నమోదైన తర్వాత మాత్రమే ఆధార్ సీడ్ చేయడం జరుగుతుందని, దీన్ని గమనించాలన్నారు. ఆధార్ చిరునామా కచ్చితంగా సంబంధిత సచివాలయ చిరునామా ఉండాలన్నారు. కుటుంబ పెద్ద వేలిముద్రతో మాత్రమే చిరునామా మార్పు చేస్తారన్నారు.

వైభవంగా మరిడమ్మ ఉత్సవం

రోలుగుంట: పడాల పాలెం గ్రామంలో గురువారం మరిడమ్మ ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ పాచిలి రామకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం బాణసంచా కాల్చారు. చిడతలు, కోలాటం తదితర సంప్రదాయ కార్యక్రమాలతో సందడి చేశారు.